క్లుప్తంగా

త్రిపురాపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్



నకరికల్లు: ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ఎందరో రోగులకు స్వగ్రామంలోనే నాణ్యమైన వైద్యసేవలు లభిస్తున్నాయని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.బాలూనాయక్ అన్నారు. మండలంలోని త్రిపురాపురం గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సి వైద్యాధికారి వి.శ్రీనునాయక్ మాట్లాడుతూ పలురకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 141 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సపొందిన, శిబిరం వద్దకు రాలేని వారి ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, వైస్ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మద్దం సురేష్, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ



సత్తెనపల్లి: నిరుపేదలకు ప్రతి ఏటా సహాయ సహకారాలు అందిస్తూ పేదల సేవలో గంజి వీరస్వామి తరిస్తున్నాడని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహరావు అన్నారు. పట్టణంలోని రైల్వే గేటు వద్ద పేదరికంతో ఇబ్బంది పడు తున్న 33 మంది మహిళలకు సమాజ సేవకుడు గంజి వీరస్వామి ఆధ్వర్యంలో ఫణిదెం చేనేత సొసైటీ వద్ద శుక్రవారం నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. ఏపీపీ నరసింహ రావు మాట్లాడుతూ వీరస్వామిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల హనుమంతరావు, సీపీఎం నాయకులు అనుముల ధర్మయ్యలు వారు మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలుస్తున్న వీరస్వామి సేవలను కొనియాడారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వృద్ధులను, మహిళలను గుర్తించి దాతల సహకారంతో కొంత, తన సొంత డబ్బులు కొంత వెచ్చించి నిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమాలు చేయడం వీరస్వామి మంచి మనసుకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, గంజి ప్రసాద్,స్వాతి,వంగర శ్రీను ఉన్నారు.

గజ ఈతగాళ్లకు దొరకని వ్యక్తి ఆచూకీ



బెల్లంకొండ: మేతకు వెళ్లిన గేదెలు నదిలోకి దిగడంతో వాటిని తోలుకురావడానికి వెళ్లి వ్యక్తి గల్లంతైన ఘటన మండలంలోని ఎమ్మాజీగూడెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ కె.అమీర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రామనబోయిన పెద్దఅల్లయ్య (45) గల్లంతైనట్లు తెలిపారు. అల్లయ్య రోజు మాదిరిగా గేదెలను మేతకు తోలుకుని వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో గేదెలు అన్నీ పక్కనే ఉన్న పులిచింతల ముంపు బ్యాక్‌వాటర్ అయిన కృష్ణా నదిలోకి దిగాయి. వాటిని తోలుకురావడానికి అల్లయ్య నదిలోకి దిగాడు. కాగా నదిలో చేపల కోసం వేసిన పాత వలలు అల్లయ్య కాళ్లకు చిక్కుకోవడంతో బయటకు రాలేక నదిలో మునిగిపోయినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు కాపాడానికి ప్రయత్నించినప్పటికీ నదిలో లోతు ఎక్కువగా ఉండడంతో ప్రయోజనం లేకుండా పోయింది. కాగా వెంటనే ఎస్ఐ అమీర్, రెవెన్యూ సిబ్బంది అల్లయ్య అచూకీ కోసం గజ ఈతగాళ్లతో నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపుగా ఐదు గంటల పాటు నదిలో గాలింపు చేసినప్పటికీ వ్యక్తి ఆచూకీ లభించలేదని, గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా గల్లంతయిన అల్లయ్యకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా ఒకరికి వివాహం అయింది, మరో కుమార్తె చదువుకుంటున్నట్లు తెలిసింది.

గోళ్ళపాడులో గ్రామోదయం

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు గ్రామంలో పర్యటించి గ్రామస్తుల సమస్యలను తెలుసుకున్నారు. చెత్తసేకరణ తీరును పరిశీలించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించి, క్లాప్‌మిత్రలను సన్మానించారు. ముందుగా వారితో కలిసి అల్పాహారం చేసి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపుఅప్పమ్మ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, పీహెచ్‌సీ వైద్యాధికారి జయకృష్ణప్రవీణ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏపీఎమ్ రామారావు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

చదువుకొనలేని వారికి గురుకులాలు వరం

- విద్య ద్వారానే సామాజిక సమానత్వం
- అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ధైద చినబాబు
- మాస్ ఆధ్వర్యంలో గురుకుల ప్రవేశాలపై అవగాహన, నమూనా పరీక్ష నిర్వహణ



విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేస్తున్న బ్రహ్మయ్య, ధైద చినబాబు

సత్తెనపల్లి: చదువు' కొన'లేని పేద విద్యార్థులకు గురుకుల ఆశ్రమ పాఠశాలలు ఒక వరమని, విద్య ద్వారానే సామాజిక సమానత్వం సిద్ధిస్తుందని రామకృష్ణాపురం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల వైస్ ప్రిన్సిపల్ ధైద చిన్నబాబు అన్నారు. మాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రగతి జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 23వ తేదీన (ఆదివారం) జరిగే గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు శుక్రవారం అవగాహన, నమూనా పరీక్ష నిర్వహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ విద్యార్థులకు విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. గురుకులాల్లో విద్యాభ్యాసం గురించి వివరించారు. రాష్ట్ర పౌర హక్కుల నేత చిలక చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థి స్థాయిలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు. విశ్రాంత జైలర్ బ్రహ్మయ్య 40 మంది విద్యార్థులకు అవసరమైన పరీక్ష ప్యాడ్లు, పెన్నులు బహూకరించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. దళిత వర్గాల వారు ఉన్న అవకాశాలు వినియోగించు కుని ఉన్నత స్థితికి ఎదగాలని బ్రహ్మయ ఆకాంక్షించారు. రావూస్ అకాడమీ డైరెక్టర్ తోటా శ్రీనివాసరావు విద్యార్థులకు మెలకువలు నేర్పించారు. ప్రభుత్వ పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని పేరుపోగు శైలజ, సోషల్ వర్కర్ చిలక రమణయ్య తదితరులు ప్రవేశ పరీక్ష విధానాన్ని వివరించి, నమూనా పరీక్ష నిర్వహించారు. విద్యార్థులకు భోజన వసతి కల్పించి ఇలాంటి విద్యా ప్రయోజన కార్యక్రమాలు నిర్వహించటం పట్ల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సేవాదళ్ నాయకులు తాళ్లూరి అమర్నాథ్, మాజీ ఎంపిపి పచ్చల నాగేశ్వరరావు, గీతిక కంప్యూటర్స్ అధినేత విజయ్ చందు, క్రిష్ డిజిటల్స్ అధినేత గుజ్జర్లపూడి విజయ్ కుమార్, పాకాలపాడు సాంబయ్య, గోళ్ళపాడు, మాదల, పాకాలపాడు, భీమవరం గ్రామాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శుక్రవారం రాత్రి సత్తెనపల్లి గడ్డ ఎత్తిన పల్లపు సత్తెన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి, మంత్రి అంబటి, ఎమ్మెల్సీలు, నాయకులు
- సత్తెనపల్లి

పేదలకు దుస్తుల పంపిణీ



ముప్పాళ్ళ: ముప్పాళ్ళ ముస్లిం కాలనీలోని వృద్ధులకు నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. మొత్తం పది మందికి చీరెలు, దుప్పట్లు పంపిణీ చేశారు. రంజాన్ పండుగ రోజు ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ దుస్తులు పంపిణీ చేయడం జరిగిందని వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ రహంతుల్లా, బ్రహ్మరెడ్డి, శివారెడ్డి, యనమాల సింగయ్య, అన్నపురెడ్డి సాయిరెడ్డిలు తెలిపారు.

వృద్ధులకు

అచ్చంపేట: పవిత్ర రంజాన్ పండుగను పరస్కరించుకుని మండలంలోని మాదిపాడులో నిరుపెద వృద్ధులకు, వికలాంగులకు వైఎస్సార్ సీపీ మైనారిటి విభాగం కార్యదర్శి షేక్ కరిముల్లా శుక్రవారం దుస్తులు, రంజాన్‌తోఫా పంపిణీ చేశారు. ముస్లిం కుటుంబాలందరికి వెళ్లి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ముస్లిం మైనారిటి నాయకులు షేక్ జాన్‌సాహెబ్, షేక్ బాబూసాహెబ్, షేక్ సద్దాం, హుస్సేన్, భాషా, జానీ తదితరులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే శంకరరావు



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: అమరావతి అలాగే మండల పరిధిలోని మునగోడు గ్రామాల్లో పవిత్ర రంజాన్ ఉపవాసదీక్ష చేస్తున్న ముస్లిం సోదరులతో కలిసి ఇఫార్ విందులో శుక్రవారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొన్నారు. తొలుత అమరావతిలో జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ షేక్ హుష్మీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధనలు చేపిన ఉపవాసదీక్షలో ఉన్న ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. దేవునిపైన పరిపూర్ణమైన విశ్వాసంతో ఇతర మతాలతో ఒకరిని ఒకరు గౌరవించుకోవటమే రంజాన్ విశిష్టత అన్నారు. ప్రజలంతా జగనన్నకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పవాసదీక్షలో ఉన్న మముస్లిం సోదరులు. ముస్లిం మత పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో 60 రకాల వైద్య పరీక్షలు

డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శోభారాణి



పీహెచ్‌సీని పరిశీలించి మాట్లాడుతున్న డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శోభారాణి, డాక్టర్ రాజేష్

అచ్చంపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 60 రకాల రోగనిర్ధారణ వైద్యపరీక్షలను అందుబాటులో ఉంచామని, ఇందుకు సంబంధించిన అత్యాధునిక పరికరాలను, మెడికల్ కిట్స్‌ను సమకూర్చినట్లు పల్నాడు జిల్లా మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ శోభారాణి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్స్, స్టాక్ రిజిస్టర్స్, మెడికల్ రికార్డ్స్ తనిఖీ చేశారు. వైద్యశాలలో ప్రస్తుతం ఇద్దరు వైద్యులు ఉండగా ఒకరు ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ కింద రోజుకొక గ్రామానికి వెళుతుండగా, మరో వైద్యాధికారి సెలవుపై వెళ్లినప్పుడు దూరప్రాంతాల నుంచి వచ్చే రోగుల ఇబ్బందులను గుర్తించామని, మరో వైద్యాధికారిని అతి త్వరలో నియామకం చేయనున్నట్లు చెప్పారు. ప్రధానమంత్రి మాతృత్వ యోజన, సురక్ష యోజన, ఆరోగ్య ఆసరా పథకాల ద్వారా వైద్యశాలలో మొదటి కాన్పు చేసుకున్న వారికి రూ.11000 ఇవ్వనున్నట్లు చెప్పారు. రెండవ కాన్పుకు రూ.6వేలు ఇస్తామని, రెండవ కాన్పులో ఆడపిల్ల జన్మించినట్లయితే రూ.11వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రస్తుతము వైద్యశాలలో 24గంటల వైద్యసేవలను అందుబాటులో తెచ్చామని, కొత్తగా ముగ్గురు స్టాఫ్ నర్సులను నియమంచామన్నారు. ఒక్కరు 8గంటలకు ఒక షిఫ్ట్ చొప్పున విధులు నిర్వహిస్తారని చెప్పారు. ఒక వైద్యాధికారి 24/7 పర్యవేక్షిస్తారన్నారు. ప్రస్తుతం ఇంటింటికి ఫీవర్ సర్వేలు జరుగుతున్నాయని, ప్రతిరోజు ఒక గ్రామంలో ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అన్ని పీహెచ్‌సీల్లో అందుబాటులో కరోనా పరీక్షలు...

జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో కరోనా వ్యాధిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ప్రతి రోజు 200 మందికి కరోనా టెస్టులు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి విలేజ్ హెల్త్ సెంటర్స్‌లో కూడా 10 మందికి తగ్గకుండా కరోనా పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకు 39 కేసులు నమోదు అయ్యాయని, వారందరికి సకాలంలో వైద్యసేవలు అందించడంతో ఆరోగ్యంగా ఉన్నట్లు చెప్పారు. కొత్తగా నెలకొల్పిన దొడ్లేరు, పిల్లుట్ల, అయినవోలు పీహెచ్‌సీలలో వైద్యుల నియామకం జరిగిందని, ఇంకా మాదిపాడు, గామాలపాడు, పమిడిపాడు, గోలి పీహెచ్‌సీల్లో వైద్యుల నియామకం జరగాల్సి ఉందన్నారు. అమరావతి, సత్తెనపల్లి వైద్యశాలలో ఇద్దరు చొప్పున అదనపు వైద్యులను నియమించామన్నారు. ఈ ఆయుష్ ద్వారా యేడాదికి రూ.12 లక్షల విలువైన మెడిసిన్స్ పీహెచ్‌సీలలో అందుబాటులో ఉంచామన్నారు. వైద్యులు, ల్యాబ్ టెక్నిషయన్, స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ అందరు అన్ని వేళలా అందుబాటులో ఉంటారని చెప్పారు.

వైద్యసేవలను మెరుగు పరుస్తాం...

తరచూ గైర్హాజరయ్యే, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై నిఘా ఏర్పాటు చేసి బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని, పీహెచ్‌సీలలో, సబ్ సెంటర్స్, విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో వైద్యసేవలను మెరుగు పరుస్తామని డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ శోభారాణి చెప్పారు. జిల్లాలో మండలానికి ఒక 108వాహనాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. 104సేవలను విస్తరించామన్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్, పీహెచ్‌సీ సిబ్బంది ఉన్నారు.

ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం

మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహద పడతాయని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. హరి మిత్ర మండలి ఆధ్వర్యంలో 6వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకుడు సదనం హరి నేతృత్వంలో పట్టణంలోని ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద, గార్లపాడు బస్టాప్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కూలింగ్ చలి వేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మంత్రి అంబటి మాట్లాడుతూ నిత్యం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చుకునేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ఈ సందర్భంగా హరి మిత్రమండలిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వర రావు నాయక్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, నాయకులు ఆకుల రమేష్, శెట్టి ఆనంద్, తోట వెంకటేశ్వరరావు, కాకుమాను రవి, సిరిగిరి వెంకట్రావు, మాదిగొండ వెంకటేశ్వరరావు, ఉల్లంగుల ప్రసాద్, తుమ్మల వెంకటేశ్వర రావు, జొన్నలగడ్డ ఆనంద్, హరి మిత్ర మండలి సభ్యులు, తదితరులు ఉన్నారు.

చెత్తరహిత గ్రామాలుగా మారుద్దాం



క్లాప్‌మిత్రలతో కలిసి అల్పాహారం చేస్తున్న డ్వామా పీడీ బాలూనాయక్, ఎంపీడీఓ

నకరికల్లు: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడంలో గ్రీన్ అంబాసిడర్లతో పాటు గ్రామస్తులు ప్రతిఒక్కరూ బాధ్యతగా భావిస్తే చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దవచ్చని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.బాలూనాయక్ సూచించారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో ట్రాన్సిట్‌వాక్, కాఫీవిత్ క్లాప్‌మిత్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం గ్రామమంతా కలియ తిరిగారు. పారిశుద్ధ్య సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలతో మాట్లాడారు. నీటితొట్లలో నిల్వ ఉన్న నీటిని ఎంపీడీఓ, ఈఓపీఆర్డీ స్వయంగా తొలగించారు. అనంతరం చెత్త నుంచి సంపదతయారీ కేంద్రం వద్ద గ్రీన్ అంబాసిడర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారితో కలిసి కూర్చొని అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో గ్రీన్ అంబాసిడర్లకు వేతనకూలీ ఇవ్వాల్సి ఉన్నందున ప్రజలు సహకరించాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లలో అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం అన్ని సంక్షేమపథకాలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి, ఈఓపీఆర్డీ గిరిధర్, సొసైటీ అధ్యక్షుడు మేడికొండ మస్తాన్‌రెడ్డి, సర్పంచ్ అరవా ఆదిలక్ష్మి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు జక్కిరెడ్డి కోటిరెడ్డి, గోపు అంజిరెడ్డి, గ్రామ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావు, బత్తుల రామాంజినేయులు, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాదృక్పథం కలిగి ఉండాలి

మంత్రి అంబటి రాంబాబు



రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: పేదలకు సహాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ సేవాధృక్పదం కలిగి ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో పట్టణంలోని అచ్చంపేట రోడ్డు లోని రైస్ మిల్ సమీపములో 50 మంది పేద ముస్లింలకు శుక్రవారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ రోటరీ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలు చాలా బాగున్నాయని అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ వారు ఏర్పాటు చేసిన రంజాన్ తోఫాను పేద ముస్లింలు సద్వినియోగ పర్చుకోవాలన్నారు. రోటరీ జిల్లా సమన్వయకర్త బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన మిత్రులు గౌస్ మాస్టర్, అబ్బూరు పంచాయతీ సెక్రటరీ రాజేష్, అంజిరెడ్డి హాస్పిటల్ పిడుగురాళ్ల ఏఓ సుధీర్, సంచులను ఇచ్చిన శ్రీ వారాహి టెక్స్ టైల్స్ వారికి , ఉపాధ్యాయ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్ మీరాన్, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, అచ్యుత శివప్రసాద్, మహమ్మద్ గని, షేక్ మౌలాలి, మహి, రోటరీ అధ్యక్షుడు పాయసం మహేష్ బాబు, ట్రెజరర్ స్వామినాథన్ బాలసుబ్రహ్మణ్యం, బాపతు శ్రీనివాసరెడ్డి, సరికొండ రమాదేవి, మాతంగి సాంబశివరావు, ఆంధ్రప్రదేశ్ కన్జూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ప్రతినిధులు తుమ్మల వెంకటేష్, అవులమంద కమలాకర్, మాతంగి రాహుల్ గౌతమ్ పాల్గొన్నారు.

ముస్తాబైన ఈద్గాలు, మసీదులు



రంగులతో తీర్చిదిద్దిన నకరికల్లులోని కొండపై గల ఈద్గా

నకరికల్లు: ముస్లింసోదరులు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ శనివారం జరుపుకునేందుకు ముస్లింలు సర్వత్రా సిద్ధమయ్యారు. తోటివారి ఆకలిదప్పులు తెలుసుకునేందుకు కఠోర ఉపవాసదీక్షతో పాటు దానధర్మాలకు ప్రతీకగా రంజాన్ పండుగ నిలుస్తోంది. సౌదీఅరేబియా, ఖతార్, దుబాయ్ దేశాల్లో శుక్రవారం రంజాన్‌పండుగ జరుపుకోవడంతో మనదేశంలో శనివారం పండుగ జరుపుకునేందుకు ఇస్లాం మతపెద్దలు ఖరారు చేశారు. పండుగను పురస్కరించుకుని నకరికల్లు, గుండ్లపల్లి, చల్లగుండ్ల, దేచవరం, చీమలమర్రి, కుంకలగుంట, చేజర్ల, చాగల్లు తదితర గ్రామాల్లో ప్రత్యేక ప్రార్ధనలు చేసే ఈద్గాలు, మసీదులు రంగులతో తీర్చిదిద్దారు. ఈ ఏడాది రంజాన్ మాసానికి ఐదు శుక్రవారాలతో ప్రత్యేకత సంతరించుకుంది. వేసవి దృష్ట్యా ఈద్గాల వద్ద టెంట్లు, తాగునీరు ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నకరికల్లులోని కొండపై గల ఈద్గా వద్దకు చేరుకోలేని వయోవృద్ధులు, దివ్యాంగులు తదితరుల కోసం పాతూరులోని పాతమర్కస్ మసీదులో నమాజ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

నేడు రంజాన్ పర్వదినం

క్రోసూరు: ముస్లింల పవిత్ర రంజాన్ పర్వదినం శనివారం నిర్వహించుకోనున్నట్లు జామియా మసీదు ఇమాం జమాలుద్దీన్ శుక్రవారం తెలిపారు. నెలవంక చూసిన మరుసటి రోజున రంజాన్ పండుగ చేసుకోవడం ఇస్లాం ఆచారం . ఢిల్లీ ముస్లిం మత పెద్దలు నెల వంక చూసినట్లు ప్రకటించడంతో శనివారం పర్వదినం జరుపుకోవాలని ప్రకటించారు. నెలరోజుల పాటు ఉపవాసదీక్షలు చేపట్టి ఐదుపూటల ప్రార్ధనలలో అల్లాను స్మరించుకుంటూ చేసుకుంటూ ,దానధర్మాలు చేయటమే రంజాన్ విశిష్టత అని తెలియచేశారు. గ్రామాల్లో ఈద్గామైదానాలు, మసీదులు ప్రత్యేక ప్రార్ధనలకు సిద్ధం చేయడం జరిగింది.

రంజాన్ శుభాకాంక్షలు : నియోజకవర్గ ముస్లిం సోదరలందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు. పవిత్రరంజాన్ పండుగను ముస్లిందరూ సంతోషాలతో నిర్వహించుకోవాలని కోరారు.

సత్తెనపల్లి: రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులు సామూహికంగా నమాజు చేసేందుకు పట్టణంలోని మాచర్ల రోడ్‌లో గల ఈద్గాను శుక్రవారం ముస్తాబు చేశారు. ఈద్గా ప్రాంతాన్ని మున్సిపల్ కార్మికులు శుభ్రం చేశారు.

చిరువ్యాపారులకు గొడుగులు పంపిణీ



చర్మకారునికి గొడుగు అందజేస్తున్న ఎస్‌బిఐ మేనేజరు సంతోష్‌కుమార్

పెదకూరపాడు: మండుటెండలను సైతం లెక్కచేయకుండా రెక్కాడితేగాని డొక్కాడని చిరువ్యాపారాలు చేసుకుని జీవనం కొనసాగించే నిరుపేదలకు అభయ ఫౌండేషన్, హైదరాబాదువారి సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో శుక్ర వారం పెద్ద గొడుగులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరైన స్థానిక స్టేట్‌బ్యాంక్ బ్రాంచి మేనేజర్ వి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ జీవనోపాది కోసం గత్యంతరం లేని పరిస్థితుల్లో మండుటెండలను సైతం లెక్కచేయకుండా రోడ్డు పక్కన, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకునే వారికి కొంతవరకైన ఉపశమనం కల్పించేందుకు గొడుగులు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జనచైతన్య సమితి వ్యవస్థాపకులు దాసరి విజయ్‌బెన్ని మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవున్న తరుణంలో కూడా రోడ్లపక్కన చెప్పులు కుట్టుకునే చర్మకారులు, తోబడుబండ్లపై కొబ్బరిబొండాలు, పండ్లు, కూరగాయలు అమ్ముకునే వారందరికి పెద్ద గోడగులను ఇవ్వడం చాలా సంతోషకరమన్నారు. కార్యక్రమంలో 75 త్యాళ్లూరు పంచాయతీ కార్యదర్శి నెక్కంటి శ్రీనివాసరెడ్డి, కంభంపాడు పిఎస్ కె.రవిశంకర్, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, జనసమితి కో ఆర్డినేటర్ వెలితోటి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డ్వామా పీడీ బాలూనాయక్, ఎంపీడీఓ, వైస్ ఎంపీపీ

నకరికల్లు: వేసవి తాపాన్ని భరిస్తూ కార్యాలయాలకు వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని డ్వామా పీడీ, మండల ప్రత్యేకాధికారి బి.బాలూనాయక్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో కార్యాలయాల వద్ద తాగునీటి సౌకర్యం కల్పించడం అవసరమన్నారు. స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి గ్రామాల్లోని కూడళ్లు, సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఆయాశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన మహిళా జట్టును సత్కరిస్తున్న ఎంపీపీ, అధికారులు

బెల్లంకొండ: మహిళలు అన్నీ రంగాల్లో రాణించాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ సచివాలయ సిబ్బందిని సత్కరించారు. అదే విధంగా గత కొద్దిరోజు క్రిత్రం పల్నాడు జిల్లా ఆవిర్భావ వేడుకల సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో భాగంగా బేస్ బాల్ పోటీల్లో జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన మండలానికి చెందిన మహిళా జట్టు సభ్యులను సత్కారించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాధారాణి, తహసీల్దార్ నిర్మల, ఎంపీడీఓ వెంకటరెడ్డి, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.